# తెలియనివాడు

అతణ్ణి చూడకముందు అట్లాంటిమనిషి యీ ప్రపంచంలో వుంటాడని ఎవరేనా చెప్పివున్నట్లయితే నేను తప్పకుండా నిరాకరించి వుండేవాడిని. ఏమంటే మనస్తత్వాలగురించి నాజ్ఞానమ్మంతా కేవలం ఊహాజనితమే. మనుషుల్ని గురించి ఆలోచించినంతగా----- నేను కలిసి మెలిసి తిరగను.

రోజూ నేను ఎనిమిది గంటలకి బజారుకి వెళ్ళే సమయానికే అతనూ సరిగా అదే సందు మలుపులోఎదురౌతూ వుండేవాడు. ఇట్లా మూగపరిచయం మూణ్ణెల్లు సాగింతర్వాత, నేనా సందుమలుపు అతనికోసమే తిరుగుతున్నట్లుండేది. అతను కనిపించగానే యేదో తృప్తీ నిండూ అనిపించేది. నా మనస్సుకు అనుకోకుండా ప్రాప్తించే యీ నిత్యతృప్తి, పరిపూర్ణతా పురస్కరించుకుని అతనెంతో మంచివాడూ, సద్గుణ సంపన్నుడూ అయుండాలనే నాకు తోచింది. ఇంతవరకూ నాకేం ఆశ్చర్యంలేదు!

ఏం కారణమో తెలీదు కాని అతను వరసగా నాలుగురోజులు కనిపించలేదు. నాలుగురోజులూ ఏదో జ్వరం వచ్చినట్లుంది నాకు. మనస్సు కేమీ తోచటం లేదు జీవితంలో పాలుపంచుకునే వ్యక్తి ఎవరో విడిపోయి మరి తిరిగి రారని ఎవరో వివరిస్తున్నట్లుంది. నాలుగు రోజులూ నాకు అయోమయంగానూ, అగమ్యగోచరంగానూ గడిచాయి. అయితే యీ అనుతాపాన్నించి తప్పించుకునే నిమిత్తం నన్ను నేనే ప్రశ్నించుకున్నాను. "అసలు ఎవరీ వ్యక్తి ?----- అతనికీ నాకూ యేమిటి సంబంధం?" అతను కనిపించకపోతే మధ్య నాకు దిగులు దేనికి? "ఏ అప్రాచ్యుడికోసమో మనసంతా వ్యథ చేసుకోవటం దేనికి?" ఈ ప్రశ్నలకు జవాబులు దొరక్కపోగా వ్యథ మరింత ఎక్కువయింది.

కనీసం యీ వ్యక్తి పేరేమిటో నాకు తెలీదు. ఏం చేస్తాడో తెలీదు----యితనికీ, నాకు పరిచయమల్లా రోజూ సందు మలుపు దగ్గర తారసిల్లటం తప్ప మరేమీలేదు.

ఇంతా ఆలోచిస్తే నాకీ మనస్తాపం కేవలం అనవసరమనిపించింది.----కాని మనస్సు మాత్రం ఎప్పుడో వశం తప్పి పోయింది. ఊరూ పేరూ తెలియని వాడికోసం, ఉనికీ ఉద్దేశ్యమూ ఎరుగని వాడికోసం మనసు ఊరటపడుతోంది.

----ఊరటపడుతోంది మట్టుకే కాని యీ సమస్య తీరగల అవకాశం కనిపించదు. రోజూ సందు మలుపు దగ్గర తగిలే మనిషి యేమైనాడూ?---- అని ఎవరినీ అడిగేందుకు లేదుకద. అతని పేరూ, పనీ తెలియక వివరాలకోసం ప్రాకులాడటం అంత తెలివితేటలుకల పనిగా కనిపించలేదు.

ఏదో విధంగా సమస్యను మాపుచేసుకుందుకుగాను నా మనస్సు చాల దారుణమైన ఆలోచనలే చేసింది. బహుశా యీ వ్యక్తిని యెవరేనా చంపేసి వుంటారేమో ననుకున్నాను. మానవ జీవితానికి యింతకంటే మహత్కార్యం ఏముంటుంది కనక! ఎందుకు చంపివుంటారు----అని ఆలోచించగానేయీ భావన చెడ్డగా తోచింది. మరో వ్యక్తిని గురించి---- అందునా పరిచయస్థుడు కాని వ్యక్తిని గురించి----పరోక్షంలో యిట్లా అనధికార తీర్మానాలుగా రూపకల్పనలు చేయటం సమంజసం కాకపోగా శిక్షార్హం అని కూడా అనిపించింది. వెంటనే ఆ ఆలోచనకో సలాంకొట్టి సెలవు పుచ్చుకున్నాను. సాధారణ స్థాయిలో ఆలోచిస్తే అసలిది ఆలోచించవలసిన విషయంగా కనిపించనే లేదు. నా అమాయకత్వమూ, అనుమానమూ కాకపోతే: ఏమంటే యే వ్యక్తి అయినా ఎల్లకాలమూ ఒకే వూళ్లో వుండాలని, వుండినన్నాళ్లయినా ఒకటే రోడ్డున నడవాలనీ, ఒకేపని చెయ్యాలనీ రూలేమీ లేదు కదా! అట్లాంటప్పుడు సదరు వ్యక్తి వరసగా నాల్రోజులు నాక్కనిపించక పోయినంత మాత్రాన నేను ఆందోళన పడనక్కర్లేదు.

పోతే చివరికి నేనొక దారికి చేరుకున్నాను. అతను తాత్కాలిక చలనమే పొంది వున్నట్లయితే నేను అదృష్టవంతుడ్ని. నాకు కలిసిన నెలల్లోనయినా నేను అతడ్ని పరిచయం చేసుకోలేక పోవటం క్షంతవ్యంకాని నేరంకిందే జమ. దీనికి శిక్ష---- నా మనసు మీద యేదో ప్రభవించిన వ్యక్తి దూరమై పోయినందుకు వెలిబుచ్చలేని వ్యధతో కుమలటమే - అనుకున్నాను. ఈ పరితాపం నన్నెంతోబాధించ సాగింది.

అయితే యింతకీ నా దురదృష్టం ప్రారంభంకానే లేదు. అయిదోనాడు ఆ మనిషి నాకు అక్కడే ఎదురయేసరికి నేను స్తంభించిపోయాను. మనసులో అతన్ని కలుసుకోవాలనీ అతనితో స్నేహం చెయ్యాలనీ ఎంత బలీయమైన కోర్కె వున్నప్పటికీ,

ఏదో అనుమానం అతనిక నాకు కనిపించధు అని ఘంటాపథంగా చెబుతూన్నట్లు నా మనస్సుని లోగొన్నది. అందుచేతనే నేనట్లా అయిదో నాడతను కనిపించగానే స్తబ్దుడినైపోయాను. నేనీ స్తబ్దత నుంచి తేరుకోగలిగేలోగా అతనారడగులు ముందుకు వెళ్ళి పోయాడు. నేను ఆవలించాను. నా స్తబ్దతకి నన్ను నేనే నిందించుకున్నాను. కాని అందువల్ల ప్రయోజనం యేమిటి? పిలిచినా వినిపించనంత దూరం వెళ్ళిపోయాక యింకేం చెయ్యాల్సిందీ నాకు తోచలేదు. పై గా నన్ను లోగొన్న మరో దారుణ అఘూతం యేమిటంటే – నిస్తబ్దత అతనికీ ఎందుకు లేదు? నాల్రోజులుగా అతను నాకు కనిపించనందుకు నేనేదో మనస్తాపం తెచ్చి పెట్టుకున్నాను కదా---- అతనికీ యిదే పరిస్థితుల్లో చీమకుట్టినట్లయినా వుండకపోవడం ఎందుచేత? రోజూ అతను కలవగానే నాకనిపిస్తున్న పరిపూర్ణత అతని కెట్లా ప్రతిబింబిస్తోందో!

మరునాడు అనుకున్నంత పనీ చేశాను అతను అల్లంత దూరంలో వుండగానే ఒక నమస్కారబాణం పడేశాను. ప్రతి నమస్కారం చేశాడు---- అతనిదారిన అతను వెళ్ళి పోయాడు. నేనింకా పలకరిద్దామని నించున్నవాడిని నించున్న చోటే వుండిపోయాను. అతను నన్ను నిందించినట్లు అనిపించింది నాకు మొదట. కాని తరువాత నన్ను నేను సంబాళించుకో గలిగాను. ఏమంటే, నేను కేవలం ఊహల్లో తిరిగే మనిషినయినంత మాత్రాన అతను కూడా అట్లాంటి వాడేనని అనుకోవాల్సిన అవసరం యేమిటి? ప్రపంచంలో ఎన్ని పన్లు రోజూ ఒకే టైముకు జరుగుతున్నాయి కావు? అంత మాత్రాన ఆశ్చర్యపడాల్సిన అవసరం యేమిటి?

కాని యేదో వుందనే అనిపిస్తుంది. ఎంత వద్దనుకున్నా అతణ్ణి గురించే ఆలోచన కలుగుతోంది. కనీసం అతని పేరయినా నాకు తెలీదు!

మూడోనాడు ఏదైనాసరే వ్యవహారం ముడి పడాలను కొన్నాను. అనుకోవటమైతే అనుకున్నాను కాని నా చేతిలో యేముంది? – మర్నాటి నుంచి ఆ వ్యక్తి ఆ టైముకు సందు మలుపుల్లో తగల్లేదు. సరికదా యింకెక్కడా యింకెప్పుడు కనిపించలేదు. ఈ జన్మలో యిక కనిపిస్తాడన్న నమ్మకం కూడా నాకు లేదు. ♣

*(ఆంధ్రప్రభ - సచిత్ర వార పత్రిక)*